- ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు..
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య గృహ నిర్బంధం
- సీఎం పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం నాయకులు ఠాణాలకు తరలింపు

మాజీ ఎమ్మెల్యే రాజయ్యను హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నిర్బంధకాండ..

జనగామ, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అర్ధరాత్రి ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల్లోని బీఆర్ఎస్ ముఖ్య నేతల ఇళ్లకు వెళ్లి పడుకున్న వారిని లేపి మరీ వెంట తీసుకెళ్లారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్యను గృహ నిర్బంధంలో ఉంచగా, గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ గాంధీనాయక్‌ను అరెస్టు చేశారు. సభలో నిరసన తెలిపే అవకాశం ఉన్నదని అదుపులోకి తీసుకొని జనగామ, బచ్చన్నపేట, లింగాలఘనపురం, రఘునాథపల్లి, జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. సీఎం పర్యటనను నిరసిస్తూ జనగామ చౌరస్తాలో బీజేపీ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకునే ప్రయత్నంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నది. ఏఐఎస్ఎఫ్ నాయకుడు, విజయ డైరీ డైరెక్టర్, ఆటో యూనియన్ నాయకులను కూడా ముందస్తుగా అరెస్టు చేశారు.

అరెస్టులు అప్రజాస్వామికం..

– ఖండించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సీఎం పర్యటన నేపథ్యంలో జనగామ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేతలను ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికమనీ, ప్రభుత్వ పిరికిపంద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజా ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత వస్తున్నదని, అసమర్థ పాలనపై ఎక్కడ ప్రశ్నిస్తారోనని బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో పర్యటన ఉంటే జనగామ నేతలను ఎందుకు అరెస్ట్ చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు. ఇప్పటికైనా నియోజకవర్గంలో ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలి కానీ నిర్బంధాలతో నిరంకుశత్వంగా వ్యవహరిస్తే ముమ్ముందు ప్రజలే బుద్ధి చెప్తారని హితవు పలికారు.

బచ్చన్నపేటలో ముందస్తు అరెస్టు అయిన బీఆర్ఎస్ నేతలు

ఉప ఎన్నిక స్టంటే..

– మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 16 : పార్టీ ఫిరాయింపుదారులు డిస్ క్వాలిఫై అవుతారని, ఈ నియోజకవర్గంలో మళ్లీ ఉపఎన్నిక వస్తుందనే ఆలోచనతోనే సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ శంకుస్థాపనలు చేశారని మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆరోపించారు. ఆదివారం శివునిపల్లిలో ముఖ్యమంత్రి బహిరంగ సభ సందర్భంగా రాజయ్యను స్టేషన్‌ఘన్‌పూర్‌లోని తన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ శ్రేణులు ఎక్కడ అడ్డుకుంటారోనని భయపడిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని అక్రమ అరెస్ట్ చేసిందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోతుందని శపించిన కడియంది, సీఎం రేవంత్ రెడ్డిది అపవిత్ర కలియిక అని పేర్కొన్నారు. ఒక పక్క ప్రభుత్వానికి ఆదాయం లేక జీతాలు ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నియోజకవర్గానికి రూ.800 కోట్లతో అభివృద్ధి చేస్తానని తూతూ మంత్రంగా చేసిన శంకుస్థాపనలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఇప్పటికైనా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేర్చకుండా, ప్రజలను వంచిస్తే ప్రభుత్వాన్ని నిలదీస్తారన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలను, ప్రజలకు చేస్తున్న మోసాలను పింక్ బుక్‌లో రికార్డు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన వారిని రాయితో కొడతానని చెప్పిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన కడియంను రాజీనామా చేయించాలని లేదా ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాజయ్య డిమాండ్ చేశారు.

శివునిపల్లిలో సీఎం సభకు ఎండలో ట్రాక్టర్‌పై వెళ్తున్న మహిళలు

ఆందోళన చేస్తున్న కళాకారులను అరెస్ట్ చేసేందుకు ఈడ్చుకెళ్తున్న పోలీసులు

చంటి పాపతో ధర్నా చేస్తున్న కళాకారిణి, ఏడుస్తున్న చిన్నారి

ఉంగరం, పుస్తెల తాడు పోయిందని చెబుతున్న కళాకారిణి

రేవంత్‌రెడ్డికి నిరసన సెగ

- సాంస్కృతిక సారథి ఉద్యోగాల కోసం సభలో ఫ్లెక్సీ ప్రదర్శించిన మహిళా కళాకారులు
- ఫోన్లు గుంజుకొని, ఫ్లెక్సీ చింపేసిన పోలీసులు
- ఉద్యోగాల హామీని నెరవేర్చాలంటూ నినాదాలు

జనగామ, మార్చి 16 (నమస్తే తెలంగాణ)/స్టేషన్‌ఘన్‌పూర్ : స్టేషన్‌ఘన్‌పూర్‌లో 'ప్రజాపాలన–ప్రగతి బాట' పేరిట తలపెట్టిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డికి నిరసన సెగ తలిగింది. తీవ్రమైన ఎండలో నిర్వహించిన ఈ సభలో మహిళా కళాకారులు డిమాండ్ల సాధన కోసం ముఖ్యమంత్రి మాట్లాడుతుండగానే ఒక్కసారిగా ఫ్లెక్సీ ప్రదర్శించి తమ సమస్యను తెలిసేలా చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సాంస్కృతిక సారథిలో తమకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ సభకు ముందు కుడివైపున కళాకారులు ఫ్లెక్సీ పట్టుకొని నిల్చున్నారు. ఆ ఫ్లెక్సీని చూసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసహనానికి గురయ్యారు. 'ఫ్లెక్సీని చూశాను, ఇక దించండి' అనగా కళాకారులు కూర్చునేలోపే ఒక్కసారిగా అక్కడున్న పోలీసులంతా అమాంతం వారిని చుట్టుముట్టారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొన్నది. ఈ క్రమంలో మహిళా కళాకారుల ఫోన్లను, వారి ప్రదర్శించిన ఫ్లెక్సీని లాక్కున్నారు. మహిళా కళాకారులను పోలీసులు ఈడ్చుకుంటూ సభలో నుంచి బయటికి తీసుకువెళ్లారు. కొందరు మహిళా కళాకారులు చంటి బిడ్డలతో వచ్చారు. ముఖ్యమంత్రి మెప్పు కోసం పోలీసులు వారితోనూ దురుసుగా ప్రవర్తించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు ప్రయత్నిస్తే ఇలా అమానుషంగా వ్యవహరించారని కళాకారులు ఆవేదనకు లోనయ్యారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తమకు ఉద్యోగాలను ఇవ్వాలని కోరారు. ఏడాదిన్నర గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేలను, అధికారులకు ఎన్నోమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని చెప్పారు. సమస్య చెప్పుకొనేందుకు చాలాసార్లు ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ అడిగినా స్పందన రాలేదని వాపోయారు. అందుకే నేరుగా తమ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లేందుకే సభలో ఫ్లెక్సీ ద్వారా గుర్తు చేశామని చెప్పారు. వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ కళాకారుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పిల్లలతో వచ్చిన తమపైనా పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

హైదరాబాద్ తరహా వరంగల్ అభివృద్ధి

- కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తెచ్చినం
- మామునూరుకు ఎయిర్‌పోర్ట్ వస్తుంది
- స్టేషన్‌ఘనపూర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

జనగామ, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఔటర్‌రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సహా ఇతర అభివృద్ధి పనులకు రూ.6,500 కోట్లు మంజూరు చేసి హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో రూ.800 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శివునిపల్లి వద్ద వర్చువల్‌గా ఆదివారం ఆయన శంకుస్థాపన చేసి అనంతరం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన ఏర్పాటుచేసిన ప్రజాపాలన బహిరంగసభలో మాట్లాడారు. అంతకుముందు ఇందిరా మహిళా శక్తి స్టాల్స్‌ను సందర్శించి బస్సులను ప్రారంభించి ఎస్‌హెచ్‌జీ మహిళలకు బ్యాంక్ లింకేజీ చెక్కులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సీఎం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎందరో ఉద్యమకారులకు, వీరులకు, మేధావులకు పుట్టినిల్లు అయిన ఓరుగల్లుకు గొప్ప చరిత్ర ఉన్నదని తెలంగాణకు వెన్నుదన్నుగా నిలిచిన వరంగల్ అంటే తనకు ప్రత్యేకమైన అభిమానమని చెప్పారు. అందుకే అభివృద్ధిలో హైదరాబాద్‌తో పోటీపడేలా వరంగల్ దూసుకుపోతున్నదని, కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, వరంగల్ మామునూరుకు ఎయిర్‌పోర్టు తీసుకువచ్చామన్నారు. జయశంకర్ సార్ ఊరిని తాను వచ్చిన తర్వాత రెవెన్యూ గ్రామంగా చేశానని తెలిపారు. బకాయిలు రూ.8 లక్షల 29వేల కోట్లు అయితే అసలు, మిత్తి కలిపి రూ.లక్షా 53వేల కోట్లు చెల్లించిన పరిస్థితి వచ్చిందని.. ఈ డబ్బులు ప్రభుత్వం వద్ద ఉంటే ఇల్లు లేని పేదవాడే లేకుండా అందరికీ ఇండ్లు కట్టించవచ్చని, మరో 70లక్షల మందికి రైతు రుణమాఫీ చేయొచ్చు అని సీఎం వ్యాఖ్యానించారు. బడ్జెట్, ఆదాయం తగ్గి ప్రజలకు మంచి చేయడంలో కాస్త వెనుకబడ్డామని.. ఎన్ని కష్టాలున్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్ని వర్గాలకు సంక్షేమం అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని మన భవిష్యత్ తరాల కోసం పునర్నిర్మాణం చేసుకుందామని అందరూ అండగా నిలబడాలని కోరారు.

డంప్‌యార్డు బాధితులకు నిరాశే

- తొలగింపునకు స్పష్టమైన హామీ ఇవ్వని సీఎం
- అసంతృప్తి వ్యక్తం చేసిన మడికొండ, రాంపూర్ వాసులు

మడికొండ, మార్చి 16 : డంప్‌యార్డు తొలగింపు విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంపై మడికొండ, రాంపూర్ సహా పలు గ్రామల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డును మరో ప్రాంతానికి తరలించాలని మడికొండ, రాంపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అడ్‌హక్ కమిటీలు వేసుకుని ప్రజలు గత నెల రోజులుగా పార్టీలకతీతంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులను కలిసి విన్నవిస్తున్నారు. యార్డు వల్ల శ్వాసకోశ వ్యాధుల బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నామని, గాలిలో ఆక్సిజన్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని డంపింగ్‌యార్డు బాధితులు కలిసినప్పుడు సీఎంతో హామీ ఇప్పిస్తామనడంతో సంతోషం వ్యక్తం చేసిన ఆయా గ్రామాల ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన కోసం ఎంతో ఆశగా ఎదురుచూశారు. కానీ వారికి నిరాశే మిగిలింది. సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ రాంపూర్‌లోని డంపింగ్‌యార్డును ప్రస్తావించారు తప్ప ఎన్ని రోజుల్లో తరలిస్తామనే విషయం స్పష్టంగా చెప్పకపోవడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా తరలిస్తామంటూ మాటలు చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు నీరు లేక పంటలు ఎండి రైతన్న గుండె మండుతున్నది. చివరి తడి కోసం అన్నదాతలు తల్లడిల్లుతున్నారు. వాగుల్లో చెలిమలు తీసి ఒక్కో బొట్టును ఒడిసి పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పదేళ్లలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భూగర్భ జలమట్టాలు లోలోతుకు పడిపోవడం ఇదే తొలిసారి. దీంతో బోరు, బావులూ ఎండి రైతన్నలకు సాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. మార్చిలోనే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్, మే నెలల్లో సమస్య మరింత జఠిలం కానుంది. ఈ ఏడాది తాగడానికి కూడా తండ్లాట తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

– మహబూబాబాద్, మార్చి 16(నమస్తే తెలంగాణ)

పిచ్చిమొక్కలతో నిండి ఉన్న డోర్నకల్ మండలంలోని వెన్నారం కాల్వ

ఎండుతున్న పంటలను చూసి రైతు దిగాలు

- వాగుల్లో చెలిమలు తీసి నీటిని ఒడిసి పడుతున్న కర్షకులు
- భారీగా పడిపోయిన భూగర్భ జలాలు
- ఈ ఏడాది తాగు నీటికి కష్టమేనంటున్న నిపుణులు

చివరికి తండ్లాటే

ఒక్క నెలలోనే సగటున 0.82 మీటర్ల భూగర్భ జలాలు లోతుకు పడిపోవడం ఆందోళన కలిగిస్తున్నది. చివరి తడి కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. వాగులు, చెక్ డ్యాంలు, చెరువులు, కుంటలు, ఎస్సారెస్పీ కాలువల్లో ఇలా ఎక్కడ దొరికితే అక్కడి నుంచి మోటర్లు పెట్టి పారిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వరి పొట్టకొచ్చి ఉన్నది 40శాతం అయితే, ఈనింది 60 శాతం వరకు ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. పొట్టకొచ్చిన వరికి 20–25 రోజులు, ఇప్పటికే ఈనిన వరి కోసం అయితే 15 నుంచి 20రోజుల పాటు సాగునీరు అవసరం. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాల్వల ద్వారా కాళేశ్వరం నీళ్లను తెచ్చి చెరువులు, కుంటలు, వాగుల్లో ఉన్న చెక్ డ్యాంలను నింపడంతో 30శాతానికి పైగా భూగర్భ జలాలు వృద్ధి చెందేవి. వేసవిలో సైతం పుష్కలంగా నీరు ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాగునీరందించకపోవడంతో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు ఎండిపోయి భూగర్భ జలమట్టం పూర్తిగా పడిపోయింది. దీంతో బోరు బావులు సైతం నీళ్లు లేక రైతులు చివరి తడి కోసం భగీరథ యత్నం చేస్తున్నారు. ఎంత చేసినా చాలా చోట్ల తమ పంటలను కాపాడుకోలేకపోయామని విలపిస్తూ పశువులు, గొర్లను మేపుతున్నారు.

వెన్నారం కాల్వలో పడేసిన చెత్తాచెదారం

ఎండిన కాల్వలు..

ఎస్సారెస్పీ మొదటి దశ, రెండో దశ పనులు పూర్తి చేసి సూర్యాపేట జిల్లా ఆఖరి ఆయకట్టు వరకు నీరందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికి దక్కుతుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి అక్కడి నుంచి మిడ్ మానేరు, ఎస్సారెస్పీ కాల్వల ద్వారా రిజర్వాయర్లు, చెరువులు, వాగుల్లో ఉన్న చెక్‌డ్యాములను నింపి చివరి ఆయకట్టు పండించే వరకు నీరందించింది. ఎస్సారెస్పీ మొదటి దశలో డీబీఎం 48 ద్వారా కేసముద్రం, మహబూబాబాద్, కురవి, డోర్నకల్ మండలం వెన్నారం వరకు సాగునీరు అందించింది. రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టును విస్మరించి రైతులకు నీరు లేకుండా చేసింది. మొదటి దశకు నీళ్లు రాకపోవడంతో ఇప్పుడు వరి పంట సగం ఎండిపోయే పరిస్థితి వచ్చింది. వరి ఈనుతున్న సమయంలో తడి లేక మడి ఎండుతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సారెస్పీ రెండోదశ..

ఎస్సారెస్పీ డీబీఎం 60 ప్రధాన కాల్వ తొర్రూరు మండలం నాంచారిమడూరు, పటేల్‌గూడెం నుంచి మరిపెడ వరకు 45 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. జిల్లాకు ప్రతి రోజూ 1200 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా 650 క్యూసెక్కులే వస్తున్నది. గతంలో నిరంతరంగా మే నెలలో కూడా సాగునీరు వచ్చేది. ప్రస్తుతం వారం విడిచి వారం వస్తున్నది. ప్రస్తుతం కాల్వ కింద 8 వేల ఎకరాల్లో ఇప్పటికే 2వేల ఎకరాల వరి పంట ఎండిపోయింది. మరో నాలుగు రోజులు గడిస్తే మరో 2 వేల ఎకరాలకు నీరందని పరిస్థితి. జిల్లాలో డీబీఎం 57, 59 కాల్వ పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. నీళ్లు రాకపోవడంతో రైతులు అరిగోస పడుతున్నారు.

భూగర్భ నీటిమట్టం

జిల్లా	2023 ఫిబ్రవరి	2025 ఫిబ్రవరి
హనుమకొండ	4.48	6.30
వరంగల్	4.01	5.66
మహబూబాబాద్	4.22	5.82
జనగామ	5.57	8.01
భూపాలపల్లి	7.26	9.10

పదేళ్లలో ఎప్పుడూ పంట ఎండలే..

పెద్దవంగర, మార్చి16: పదేళ్లలో ఎప్పుడూ కూడా గుంట భూమి కూడా ఎండలే. యాసంగి దినమని నాకున్న మూడెకరాల్లో రెండు ఎకరాల్లో వరి పంట వేసిన. ఇప్పుడు పంటకు నీరు లేక పశువులకు మేతగా మారి.. మాకు కన్నీరు మిగిలింది. ఎప్పుడు లేనంతగా భూగర్భ జలాలు అడుగంటడంతో పెట్టిన పెట్టుబడి రాక పశువులకు మేతగా మిగలడంతో మా గోస చెప్పుకోవడానికి ఎంతో కష్టంగా ఉంది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– పాయిలి శంకరయ్య, రైతు, గంట్లకుంట, పెద్దవంగర

ఎక్కడి పథకాలు అక్కడే..

రేగొండ మండలంలోని పైలట్ గ్రామమైన లింగాలలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని అభివృద్ధే దర్శనమిచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క సీసీ రోడ్డు వేసి చేతులు దులుపుకున్నారే తప్ప మిగతా అభివృద్ధి పనులు ఎక్కడా కనిపించలేదు. ఇటీవల మరో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేయగా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. గ్రామంలో 1,355 మంది జనాభా ఉండగా, గతంలో 795 మంది రైతులు రైతుబంధు సాయం పొందారు. ప్రస్తుతం 741 మందికి రైతు భరోసా అందింది. కొత్త రేషన్ కార్డులకు 150 దరఖాస్తులు రాగా 57 మందిని అర్హులుగా ప్రకటించి 23 మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఆత్మీయ భరోసాకు 180 మంది దరఖాస్తు చేసుకుంటే 28 మందిని ఎంపిక చేసి ముగ్గురికే ప్రొసీడింగ్స్ ఇచ్చారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల కోసం 431 మంది అర్జీ పెట్టుకోగా 214 మందిని అర్హులుగా గుర్తించారు. ఇందులో కేవలం 70 మందికే ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఇందిరమ్మ ఇండ్లను 400 స్క్వేర్ ఫీట్ల లోనే నిర్మించుకోవాలనే ప్రభుత్వ నిబంధన అవరోధంగా మారిందని, ఇంత తక్కువ స్థలంలో ఇల్లు ఎలా నిర్మించుకుంటామని, నివాసం ఉండడానికి, పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవడానికి ఎలా సరిపోతుందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో నిర్మించిన వైకుంఠ ధామం నిర్వహణ లేక పిచ్చి మొక్కలతో నిండిపోయింది. అక్కడే ఉన్న చేతి పంపు చెడిపోయింది. అలాగే గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలో చెట్లు ఎండిపోయి చిత్తడిగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన జీపీ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలను గత ప్రభుత్వం అభివృద్ధి చేయగా, నేడు ఆవరణంతా అస్తవ్యస్తంగా మారింది. పాఠశాలలోని క్రీడా ప్రాంగణంలో నర్సరీ ఏర్పాటు చేశారు.

పిచ్చిమొక్కలతో నిండి ఉన్న వైకుంఠధామం

ఎండిపోయిన మొక్కలతో చిత్తడిగా మారిన పల్లె ప్రకృతి వనం

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కళ కళ లాడిన పల్లెలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడగా, పాలన పడకేసింది. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కొరవడడం, నిర్వహణ లోపంతో పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు వెలవెలబోతున్నాయి. వైకుంఠ ధామాలు పిచ్చి మొక్కలతో నిండిపోయి మందుబాబులకు అడ్డాగా మారగా, రోడ్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ఇటీవలె నాలుగు పథకాలు అమలుచేస్తామంటూ ప్రకటించిన ప్రభుత్వం మండలానికొక పైలట్ గ్రామాన్ని ఎంపిక చేసింది. కొద్దిరోజుల క్రితం అర్భాటంగా పథకాల అర్హులను ప్రకటించి, ఇందులో కొద్దిమందికే ప్రొసీడింగ్స్ ఇచ్చి చేతులు దులుపుకుంది. ఈ గ్రామాల్లోనూ పథకాలు అమలు కాక.. అభివృద్ధి జరగక ప్రజలు అవస్థపడుతున్నారు. ఈ క్రమంలో పైలట్ గ్రామాల్లో పరిస్థితిని సవివరంగా తెలుసుకున్న 'నమస్తే తెలంగాణ' రేగొండ మండలంలోని లింగాలలో క్షేత్రస్థాయిలో పర్యటించింది. గ్రామస్తులు, లబ్ధిదారులతో ముచ్చటించింది. - జయశంకర్ భూపాలపల్లి, మార్చి 16 (నమస్తే తెలంగాణ)

- నిధుల లేమి, నిర్వహణ లోపంతో కళ తప్పిన పల్లెలు
- పూర్తి స్థాయిలో అమలు కాని పథకాలు
- అధిక సంఖ్యలో అర్హులు.. కొద్ది మందికే ప్రొసీడింగ్స్
- లింగాల గ్రామంలో పర్యటించిన 'నమస్తే తెలంగాణ'
- పథకాల అమలుపై ఆరా.. పల్లె స్థితిగతుల పరిశీలన

అర్ధాంతరంగా నిలిచిపోయిన జీపీ భవన నిర్మాణ పనులు

ఫీల్డ్ విజిట్

ఏడకేసిన పాలన

పైలట్ గ్రామాల్లోనూ అటకెక్కిన అభివృద్ధి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 12 మండలాల్లో 12 పైలట్ గ్రామాలను ఎంపిక చేశారు. అందులో రామగుండాలపల్లి, టేకుమట్ల, ముచినిపర్తి, అంకుశాపురం, లింగాల, బుర్రకాయలగూడెం, రాంపూర్, ధన్వాడ, మాదారం, నాచారం, ఎల్కేశ్వరం, పంకెన గ్రామాలున్నాయి. వీటిలో గ్రామ సభలు నిర్వహించి నాలుగు పథకాలకు అర్హులను గుర్తించి అందులో కొద్దిమందికే ప్రొసీడింగ్‌లు ఇచ్చారు. ఇందులో అధిక శాతం కాంగ్రెస్ కార్యకర్తలే ఉన్నారన్న ఆరోపణలూ వ్యక్తమవుతున్నాయి. పైలట్ గ్రామాల్లో మొత్తం 12,623 మంది జనాభా ఉండగా గతంలో 7,129 మంది రైతుబంధు పొందారు. ఇప్పుడు 6,699 మందికి రైతు భరోసా వస్తున్నది. అలాగే కొత్త రేషన్ కార్డుల కోసం మొత్తం 980 దరఖాస్తులు రాగా 536 మందిని అర్హులుగా ఎంపిక చేసి 446 మందిని, ఆత్మీయ భరోసాకు 703 అర్జీలు వస్తే 342 మందిని అర్హులుగా గుర్తించి 333, ఇందిరమ్మ ఇండ్ల కోసం 2,724 దరఖాస్తులు రాగా 1,533 మందిని అర్హుల జాబితాలో చేర్చి 956 మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చారు.ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి నిబంధనలు అడ్డొస్తుండడంతో చాలా మంది నిర్మాణం చేపట్టేందుకు వెనుకాడుతున్నారు. కాగా, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిందేమీలేదని పైలట్ గ్రామాల ప్రజలు అంటున్నారు.

ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి పనులు ప్రారంభించని లబ్ధిదారుడు

రుణమాఫీ కాలేదు

నాకు మూడెకరాల భూమి ఉంది. పంట రుణం తీసుకున్న. వడ్డీతో కలిపి రూ.2 లక్షలకు పైగా అయింది. నాకు రుణమాఫీ జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క రోడ్డు తప్ప ఎలాంటి అభివృద్ధి జరగలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రోడ్లు, వైకుంఠ ధామం, పల్లె ప్రకృతి వనం, గ్రామ పంచాయతీ భవనం పనులు జరిగాయి. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను అందంగా మార్చారు. పథకాలన్నింటికీ దరఖాస్తులు తీసుకున్నారు తప్ప ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేదు. 400 స్క్వేర్ ఫీట్లలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలంటున్నది. ముగ్గు కొంచెం ఎక్కువ పోస్తే బిల్లు రాదట. దీంతో చాలా మంది నిర్మాణానికి వెనుకాడుతున్నారు.

– సామల లక్ష్మణ్, రైతు, లింగాల రేగొండ మండలం